క్లుప్తంగా

అరుదైన రాళ్లు హిందూ కళాశాలకు అందజేత

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు, ఇన్‌టాక్ కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ ఇటీవల అమెరికాలో పర్యటించిన సందర్భంగా అక్కడి యోమింగ్ వాయువ్యంలోని ఎల్లోస్టోన్ ప్రాంతంలో అగ్నిపర్వత విస్ఫోటనం వలన ఏర్పడే లావా ప్రవాహం నుంచి అరుదైన ఎల్లోస్టోన్స్ సేకరించారు. ఈసందర్భంగా శనివారం మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో ఆయన తాను సేకరించిన అరుదైన రాళ్లను భూగర్భశాస్త్ర విభాగానికి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, జియాలజీ విభాగాధిపతి షేక్ జాన్ సాహెబ్, అధ్యాపకులు కె.గురుబ్రహ్మం, అధ్యాపక సంఘ కార్యదర్శి పీవీ రాము పాల్గొన్నారు.

ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ పరీక్షల్లో..
ఎన్‌సీసీ ఆంధ్ర బెటాలియన్ నిర్వహించిన బీ–సర్టిఫికెట్ పరీక్షల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. పరీక్షలకు హాజరైన 15 మంది విద్యార్థుల్లో ఆరుగురు ఏ గ్రేడ్ తొమ్మిది మంది బీ గ్రేడ్‌లో ఉత్తీర్ణులైనట్లు వివరించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అభినందించారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ జూనియర్ కమాండింగ్ అధికారి కృష్ణ, హవల్దార్ చిరంజీవి ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

నేడు ఏఎన్నార్ చిత్రాల ప్రదర్శన

నగరంపాలెం: ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన నటించిన అపురూప చిత్రాలను సినిమా థియేటర్‌లో ఉచితంగా ప్రదర్శించనున్నట్లు అక్కినేని నాగేశ్వరరావు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు పి.సూరిబాబు తెలిపారు. గుంటూరు రైల్వేస్టేషన్‌రోడ్డు కీర్తన థియేటర్ ఆవరణలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం ఆట 'భార్యాభర్తలు', మధ్యాహ్నం 'డాక్టర్ చక్రవర్తి', ఫస్ట్ షో 'మనం', సెకండ్ షో 'ప్రేమనగర్' చిత్రాలను ప్రదర్శిస్తారని, ఏదైనా గుర్తింపు కార్డు చూయించి ఉచితంగా ఏఎన్నార్ చిత్రాలను వీక్షించవచ్చునని ఆయన తెలిపారు.

బీజేపీలో చేరిన న్యాయవాది

గుంటూరు మెడికల్: ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సత్య సాయిబాబు శనివారం బీజేపీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు సమక్షంలో పార్టీలో చేశారు. గతంలో గుంటూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. జూపూడి రంగరాజు పార్టీ కండువాకప్పి సత్య సాయిబాబును పార్టీకిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, కె.దుర్గాప్రసాద్, కుమార్ గౌడ్, భీమినేని చంద్రశేఖర్, వి.వీర సుధాకర్ పాల్గొన్నారు.

26న చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

నెహ్రూనగర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఈ నెల 26న గుంటూరు నగరం చంద్రమౌళినగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు నేషనల్ ధోబీ మహాసంఘ్ జాతీయ అధ్యక్షులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తెలిపారు. విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం పట్టాభిపురంలోని సంఘ కార్యాలయంలో బీసీ సంఘ నాయకులతో కలసి ఆవిష్కరించారు.

కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలి

నెహ్రూనగర్: వరదల నేపథ్యంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించాలని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు) కోరారు. ఈ మేరకు కమిషనర్ పులి శ్రీనివాసులకు శనివారం వినతిపత్రం అందజేశారు. అధికారుల లెక్కల ప్రకారం నోటిఫైడ్ స్లమ్స్ కొన్ని ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారు అధికంగా ఉండే ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక చర్చ జరపాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అదే విధంగా 2024–25 సంవత్సర బడ్జెట్‌కు సంబంధించినటువంటి అంశాల్లో ఇప్పటి వరకు రోడ్లు, డ్రెయిన్లు, ఇతర పారిశుధ్యం అభివృద్ధిలో భాగంగా ఎంత బడ్జెట్‌ను ఇప్పటి వరకు ఖర్చు చేశారో.. ఇంకా ఎంత బడ్జెట్ మిగిలి ఉందనే అంశంపై చర్చించేందుకు అత్యవసర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని నగర కమిషనర్‌తో పాటు మేయర్ కావటికి మనోహర్‌నాయుడుకి కూడా విన్నవించారు.

బృందగానం పోటీలు

నగరంపాలెం: స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో భారత్ వికాస్ పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో శనివారం జాతీయ బృందగానం పోటీలు -2024 నిర్వహించారు. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ గుంటూరు కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్, శ్రీత్యాగరాజ సంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సిహెచ్. చలమయ్య, అమరావతి ప్రాంత అధ్యక్షులు రూప్ చంద్ జైన్, ప్రధాన కార్యదర్శి టిఎస్.రాజశేఖర్, కోశాధికారి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేధిస్తున్న భర్తపై కేసు

లక్ష్మీపురం: భార్యపై అనుమానంతో వేధింపులకు గురి చేస్తున్న భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. గుండారావుపేటకు చెందిన వి.రాణికి వీరయ్యతో పదేళ్ల కిందట వివాహం అయింది. భర్త వేధింపులు పడలేక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సలాం కేసు నమోదు చేశారు.

జీజీహెచ్‌లో క్యాన్సర్ బాధితులకు భరోసా


నేడు వరల్డ్ రోజ్ డే
- గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు
- ఉచితంగా క్యాన్సర్ ఆపరేషన్లు
- ఆధునిక చికిత్స విధానాలు అమలు

క్యాన్సర్ ... ఈ వ్యాధి పేరు చెబితేనే చాలా మందికి ఒంట్లో వణుకు పుట్టుకొస్తుంది. ఈ వ్యాధి వస్తే చనిపోవటమే అనే అపోహల్లో ప్రజలు ఉన్నారు. పూర్వ రాచపుండుగా పిలువబడే క్యాన్సర్‌కు చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్ ఉన్న వాళ్లల్లో వ్యాధిపై ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు 22న రోజ్ డే నిర్వహిస్తున్నారు. –గుంటూరు మెడికల్

రోజ్ డే నేపథ్యం...
కెనడాదేశానికి చెందిన 12 ఏళ్ళ మెలిండా రోజ్ అనే బాలిక 1994లో క్యాన్సర్ వ్యాధికి గురైంది. అది కూడా చాలా అరుదైన బ్లడ్ క్యాన్సర్ వ్యాధి అవ్వడం, కొన్ని వారాల్లోనే బాలిక చనిపోతుందని డాక్టర్లు చెప్పడంతో రోజ్ తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. కాని రోజ్ ఎలాంటి బాధ లేకుండా, భయపడకుండా ఆస్పత్రిలో ఉన్న రోగులకు రోజా పువ్వులు అందించి, వారికి కవితలు వినిపించి రోగులలో మనో ఉల్లాసాన్ని కలిగించింది. ఈ విధంగా ఆరునెలల పాటు ఆస్పత్రిలో రోగిగా చికిత్స పొందుతూ రోగులను చిరునవ్వుతో పలుకరిస్తూ ఉత్తరాలు రాస్తూ వారిని ఆనందింపజేసి సెప్టెంబరు 22న మరణించింది. ఆ బాలిక జ్ఞాపకార్థం ప్రతి ఏడాది రోజ్‌డేను నిర్వహిస్తున్నారు.

క్యాన్సర్ కారణాలు.....
క్యాన్సర్ రావటానికి ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగమే. సిగిరెట్, బీడీ, చుట్ట, పాన్ పరాగ్, ఖైనీ, గుట్కా ఇలా ఏ రూపంలో పొగాకును తీసుకున్నా క్యాన్సర్ వస్తుంది. మద్యపానం, వ్యాయామం చేయకపోవటం, ఆకు కూరలు తినకపోవటం, ఊరగాయపచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినటం, అధిక బరువు ఉండటం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌లు వచ్చే అవకాశం ఉంది.


జీజీహెచ్‌లోని క్యాన్సర్ వార్డు


లీనియర్ యాక్సిలేటర్ వైద్య పరికరం

క్యాన్సర్ రోగులకు భరోసా....
గతంలో ఎన్నడూ లేని విధంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాన్సర్ రోగులకు భరోసా కల్పించేలా సంస్కరణలు చేపట్టారు. క్యాన్సర్ రోగులకు భరోసా కల్పిస్తూ క్యాన్సర్ ప్రొసీజర్స్ పెంచారు. ఆరోగ్యశ్రీ పథకంలో 2019 వరకు క్యాన్సర్ రోగులకు 223 ప్రొసీజర్స్‌కు మాత్రమే చికిత్స అందించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం 648 క్యాన్సర్ ప్రొసీజర్స్‌కు ఉచితంగా చికిత్స అందిస్తూ పెద్ద భరోసా కల్పించింది.

జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు
గుంటూరు జీజీహెచ్‌లో 2020 జూలైలో అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. 2020లో 2067 మంది, 2021లో 5,865 మంది చికిత్స పొందారు. 114 మందికి ఆపరేషన్లు చేశారు. 2022లో 13,107 మంది చికిత్స పొందగా, 395 మందికి ఆపరేషన్లు చేశారు. 2023లో 14,647 మంది చికిత్స పొందగా, 753 మందికి ఆపరేషన్లు చేశారు. 2024 ఆగస్టు వరకు 9,376 మంది చి కిత్స పొందగా 542 మంది ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడారు.

క్యాన్సర్‌కు ఆధునిక వైద్యం



క్యాన్సర్‌కు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు వ్యాధి వచ్చే అవకాశం ఉందా లేదా నిర్ధారించే బీఆర్‌సీఏ-1, 2 పరీక్షలు ఉన్నాయి. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ ఫెయిల్ బయోథెరపి ద్వారా వైద్యం చేసి ప్రాణాలు కాపాడుతున్నారు. లాప్రోస్కోపిక్ సర్జరీలు, రొబోటిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సుమారు రూ.45 కోట్లతో ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్ నిర్మాణం జరిగింది. ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. రూ.కోట్లు ఖరీదు చేసే అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ స్టిమ్యులేటర్ వైద్య పరికరాలు ప్రభుత్వం అందజేసింది. తాజాగా ప్రభుత్వం పెట్‌స్కాన్ పరికరం మంజూరు చేసింది. మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్, న్యూక్లియర్ మెడిసిన్, రేడియోథెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నాం. క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి సైతం ప్యాలేటీవ్ కేర్ చికిత్సలు ఉచితంగా ఇళ్లకు వెళ్లి అందిస్తున్నాం. మందులు కూడా ఉచితంగా అందించి క్యాన్సర్ రోగుల్లో మనో ధైర్యం కల్పిస్తున్నాం. త్వరలో మరో వంద పడకలతో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మాణం చేపట్టనున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్‌చైర్మన్

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్



స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా మహిళలు 45 సంవత్సరాలు దాటాక ప్రతి ఏడాది మెమో గ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. లంగ్ క్యాన్సర్ రాకుండా, పేగు సంబంధిత క్యాన్సర్లు 55 సంవత్సరాలు దాటిన వారు సీటీ స్కాన్, కొలనోస్కోపి చేయించుకోవాలి. తొమ్మిదేళ్ల నుంచి 11 ఏళ్లలోపు బాలికలకు, 45 సంవత్సరాల్లోపు మహిళలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. హెపటైటీస్ బీని కూడా వ్యాక్సిన్ వేయించుకుని రాకుండా నిరోధించవచ్చు.

– డాక్టర్ భైరపనేని స్రవంతి, మెడికల్ అంకాలజిస్ట్

జైన్ హైస్కూల్ విద్యార్థులను అభినందించిన సీఎం



గుంటూరు ఎడ్యుకేషన్: గత ఏడాది టెన్త్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన జైన్ హైస్కూల్ విద్యార్థులను సీఎం చంద్రబాబు అభినందించారని పాఠశాల డైరెక్టర్ ఎండీ మున్ను, ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబును విద్యార్థులతో పాటు క్యాంపు కార్యాలయంలో కలిసినట్లు తెలిపారు. టెన్త్ ఫలితాల్లో 586 మార్కులు సాధించిన షేక్ రఫీతో పాటు జి. వెంకట చరిష్మా 567, కె.భానుప్రసాద్ 565, సీహెచ్ భాగ్యలక్ష్మి 564, ఎం. శశాంక్ 560, జి. చరణ్‌తేజ 556, షేక్ ముస్కాన్ 555, ఎం.భవ్య 555, వై.భార్గవి 554, షేక్ అక్రమ్ హుసేనీ రెహాన్ 552, షేక్ నసీమా 550, పి.అర్షియా సుల్తానా 550 చొప్పున విజయకేతనం ఎగురవేశారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించిన సీఎం చంద్రబాబు ఉన్నతవిద్యలో సైతం ఇదే విధంగా ప్రతిభ కనబర్చాలని ఆశీర్వదించారని తెలిపారు.

బీజేపీ నేతల ఫిర్యాదు

గుంటూరు మెడికల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వినియోగించడంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు కోరారు. ఈమేరకు శనివారం గుంటూరు బీజేపీ ధార్మిక సెల్ కన్వీనర్ ప్రతాప ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంపాలెం సీఐ మధుసూదన్‌ను ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ కార్యక్రమంలో నాయకులు కొక్కెర శ్రీనివాస్, బి.చంద్రశేఖర్, ఈదర శ్రీనివాస్ రెడ్డి, చరక కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు పద్మనాభం పాల్గొన్నారు.

ఇంటింటి ఓటరు సర్వే పరిశీలించవచ్చు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలు ఇంటింటి ఓటర్ సర్వే చేస్తున్నారని, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు సర్వేలో పాల్గొని పరిశీలించవచ్చని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్‌ఓ), నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కమిషనర్ చాంబర్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ స్టేషన్‌కు ఒకరిని చొప్పున బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చని, వారు సర్వేని పరిశీలించవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాలపై ఏవిధమైన అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా అందిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా బీఎల్‌ఓలు అక్టోబర్ 18 వరకు ప్రతి ఇంటిని సందర్శించి అర్హత కలిగిన కొత్తగా నమోదు కావలసిన ఓటరులను నమోదు చేయుట, నగరం నుంచి శాశ్వతంగా వదిలి వెళ్లిన వారిని, మరణించిన వారిని తొలగించడం, ఇంటి నంబర్లు, ఇతర వివరాలలో ఉన్న తప్పులను సవరణ చేయుటకు చర్యలు తీసుకుంటారన్నారు. పాత డోర్ నంబర్లు ఉన్న ఓటర్లకు కొత్త డోర్ నంబర్లు మార్చడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎల్.పద్మ, డి.జాన్ బాబు (వైఎస్సార్‌సీపీ),


మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నాయుడు ఓంకార్ (టీడీపీ), పాండురంగ విఠల్ (బీజేపీ), బి.సునీల్ కుమార్(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), సీహెచ్.వాసు (బీఎస్పీ), ఎస్.కె.ఖాసిం(సీపీఎం), టి.సేవ కుమార్ (అమ్ ఆద్మీ పార్టీ) పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కార లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక రైలుపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పి.సమత పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు
గుంటూరు నగరంలో వాయు కాలుష్య, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపునకు నగరపాలక సంస్థతో పాటుగా వివిధ శాఖల సమన్వయంతో సంయుక్త కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ అధ్యక్షతన ట్రాఫిక్ పోలీస్, డీటీసీ, విద్యుత్, కాలుష్య నియంత్రణ మండలి, ఆర్టీసీ, ఆర్ అండ్ బీ శాఖలతో సమావేశం నిర్వహించారు.

27న జాషువా సాహితీ పురస్కారం ప్రదానం



లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సభ ఈనెల 27వ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రచార పోస్టర్‌ని శనివారం అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా జయంతి సభతో పాటు 2024 జాషువా సాహితీ పురస్కారాన్ని ప్రముఖ అభ్యుదయ కవి, సాహితీ వేత్త, ఆచార్య గుమ్మా సాంబశివరావు, ప్రముఖ సాహితీవేత్త 'పాడుదామా స్వేచ్ఛా గీతం' గీత రచయిత గంటేడ గౌరునాయుడులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. సభలో మాజీ ఎమ్మెల్సీలు ఎం.వి.ఎస్.శర్మ, వి.బాలసుబ్రహ్మణ్యం, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగారు మోహన్ తదితరులు పాల్గొని ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు ఈమని అప్పారావు, కిరణ్, వై.కృష్ణకాంత్, దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తే సహించం

వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా

పట్నంబజారు: చిరువ్యాపారులపై కూటమి ప్రభుత్వం జులుం ప్రదర్శించటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయర్త షేక్ నూరిఫాతిమా ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని హిమని కూల్‌డ్రింక్ సెంటర్, లాలాపేట, పట్నంబజారు, పూలకొట్లు సెంటర్ ప్రాంతాల్లో పర్యటిస్తూ చిరు వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రోడ్లపై తోపుడు బండ్లు పెట్టవద్దంటూ.. మున్సిపల్, పోలీసు అధికారులు తీసివేయిస్తున్నారని పలువురు వ్యాపారులు వారి బాధలను వివరించారు. నిత్యం కష్టపడితే నాలుగు మెతుకులు తినే పరిస్థితి ఉంటుందని, అటువంటి వ్యాపారాలు చేయొద్దంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. చిరువ్యాపారుల సమస్యలు విని స్పందించిన నూరిఫాతిమా ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని, అండగా ఉంటామని హామీనిచ్చారు. జగనన్న ప్రభుత్వంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని కూడా ప్రతి ఏడాది అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు.

పార్టీకి కాదు.. పదవులకు రాజీనామా చేయండి
వ్యక్తిగత కారణాలతో పార్టీని వీడుతున్నామంటూ.. జనసేనలోకి వెళ్లిన కొంత మంది కార్పొరేటర్‌లు, పార్టీ సభ్యత్వంతో పాటు ఫ్యాను గుర్తుపై గెలిచిన


తోపుడు బండి మహిళతో మాట్లాడుతున్న నూరిఫాతిమా

కార్పొరేటర్ పదవులకు కూడా రాజీనామా చేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా డిమాండ్ చేశారు. మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాటు అధికారం అనుభవించి.. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కనీసం నైతిక విలువలు లేకుండా పార్టీని వీడనాడటం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ అంటే ఒక కుటుంబంలా ప్రతి ఒక్కరూ భావిస్తారన్నారు. జగనన్న చెప్పిన విధంగా ఎవరో పార్టీ నుంచి వెళ్లినంత మాత్రాన భయపడే పరిస్థితి లేదని, ఒకరూ పోతే ఆ స్థానంలో మరొకరూ వస్తారని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీని వీడి ఇతర పార్టీలోకి వెళ్తున్న వారు వారి పదవులకు కూడా రాజీమానా చేస్తే హుందాగా ఉంటుందని సూచించారు.

జమిలి ఎన్నికలు అసాధ్యం

లక్ష్మీపురం: జమిలి ఎన్నికలు ఆచరణ సాధ్యం కాదని విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.రవిబాబు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం జమిలి ఎన్నికలపై చర్చ గోష్టి నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, న్యాయవాది అవధానుల హరి మాట్లాడారు.

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రత్యేక కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విషయం తెలిసిందే.. అయితే శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గం 53వ డివిజన్‌లో చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల వృద్ధులు, మహిళలు, మెప్మా సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు, ఇతర సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉదయం 9.30గంటలకు అని చెప్పి...12.30గంటలు దాటిని రాని వైనం

వచ్చారు.. వెళ్లారు..

ఉదయం 9.30గంటలకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని.. ఉదయం 9 గంటలకు కల్లా సిబ్బంది అంతా వెంగళరావునగర్‌లోని నగరపాలక సంస్థ మున్సిపల్ హైస్కూల్ వద్దకు రావాలని.. అదే విధంగా జనాలను సమీకరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో మెప్మా సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు ఉదయం 9 గంటలకే సదరు కార్యక్రమం వద్దకు హాజరయ్యారు. వీరితో పాటు ప్రజలను కూడా సమీకరించారు. 9.30గంటలకు రావాల్సిన స్థానిక తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ 12.40 గంటలకు వచ్చారు. హడావుడిగా తన ఊకదంపుడు ఉపన్యాసం ప్రసగించి 1.08 గంటలకు క్లోజ్ చేసి వెళ్లిపోయారు.

డెప్యూటీ కమిషనర్‌కు కుర్చీ వేయని పరిస్థితి
డెప్యూటీ కమిషనర్ టి.వెంకటకృష్ణయ్య సదరు కార్యక్రమాన్ని అధ్యక్ష వహించి నడిపించారు. అయితే స్టేజ్ మీద టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కుర్చీలన్నీ నిండిపోయాయి. ఇక చేసేదేమి డెప్యూటీ కమిషనర్ అరగంట దాకా నిలబడి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

గురజాడ అప్పారావుకు ఘన నివాళి

గుంటూరు మెడికల్: సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనను తీసుకొని వచ్చారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో శనివారం తెలుగు రచయిత, కవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ ప్రియాంక, కృష్ణకుమారి, ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో...
నెహ్రూనగర్: తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు కృషి చేసిన మహాకవి గురజాడ అప్పారావు అని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో..
లక్ష్మీపురం: ఆధునిక తెలుగు సాహిత్యానికి నూతన ఒరవడులు దిద్దిన గురజాడ అప్పారావు అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాహితీవేత్త ముప్పాళ్ళ వి.ఎస్.ప్రసాదరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురజాడ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు.


గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయలక్ష్మి

కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్‌లో..
గుంటూరు ఎడ్యుకేషన్: సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా తన కలాన్నే ఆయుధంగా చేసుకుని పోరాడిన గురజాడ సమాజాన్ని చైతన్యపర్చారని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జేకేసీ కళాశాలరోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో అభ్యుదయ కవి, సంఘ సంస్కర్త గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలను నిర్వహించారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి

గుంటూరు మెడికల్: సానుకూల వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి ప్రధాని మోదీ మై భారత్‌ను రూపొందించారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో మై భారత్‌లో వలంటరీలుగా పనిచేస్తున్న 30 మందిని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సేవ చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా యువజన శాఖ అధికారి కిరణ్మయి, వలంటీర్లను సూపరింటెండెంట్‌కు పరిచయం చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేయడానికి షిఫ్టులు వారిగా 120 మంది అవసరమని చెప్పారు. ప్రస్తుతం 30 మందితో సేవా కార్యక్రమాలకు చర్యలు తీసుకొంటామన్నారు. జిల్లా యువజన శాఖ అధికారి కిరణ్మయి మాట్లాడారు.

కారిడార్‌కు మరమ్మతులు చేయిస్తాం
గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో అవుట్ పేషంట్ నుంచి ఇన్ పేషంట్‌కు వెళ్లే కనెక్టివిటీ కారిడార్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం దెబ్బతిన్న కారిడార్‌ను పరిశీలించారు. దాదాపు రూ.3 నుంచి రూ.4 లక్షలతో మరమ్మతులు చేపడుతున్నారని తెలిపారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన
గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు విధులు బహిష్కరించి శనివారం సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వలన కాంట్రాక్ట్

జీజీహెచ్ వార్తలు

నర్సింగ్ సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, స్వచ్ఛంద ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు. గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు.

కోల్‌కత్తా వ్యక్తికి బైపాస్ సర్జరీ
కోల్‌కత్తాకు చెందిన వ్యక్తికి గుంటూరు జీజీహెచ్ వైద్యులు గుండె బైపాస్ సర్జరీ చేసి ప్రాణాలు కాపాడారు. శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. కోల్‌కత్తాకు చెందిన భైరవ దత్తు కూలి పనుల కోసం గుంటూరులో ఉంటున్నాడు. ఆ రాష్ట్రంలో వైద్యులు సమ్మెలో ఉండడంతో ఇక్కడ చేరాడు. మూడు రోజుల క్రితం గుండె బైపాస్ సర్జరీ చేసి రోగి ప్రాణాలు కాపాడారన్నారు. కార్డియోథొరాసిక్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరం కుప్పుస్వామి ఆధ్వర్యంలో విజయవంతంగా గుండె బైపాస్ సర్జరీ జరిగిందన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డు ఏమీలేకపోయినప్పటికీ ఉచితంగా ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడినట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు.

రోగులకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టం



గుంటూరు మెడికల్: సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందని, రోగులకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో అదృష్టమని ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు, ఆలా హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక అమరావతి రోడ్డులోని హాస్పిటల్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన వైద్య విద్యార్థులను ఆయన అభినందించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు, స్టెతస్కోప్‌ను అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్య వృత్తిలోకి వచ్చే వారు సేవాభావం కలిగి ఉండాలని, నిరంతరం విద్యార్థి మాదిరిగా ఉండి, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం, పొన్నెకల్లు గ్రామానికి చెందిన ముగ్గురు ఎంబీబీఎస్ సీట్లు కన్వీనర్ కోటాలో పొందారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఎంబీబీఎస్ ఫ్రీ సీట్లు పొందిన ఒకే గ్రామానికి చెందిన వేమవరపు మృదులత, పల్లా త్రివేణి, బిందెల వెంకటగౌతమిలను డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ఉచిత ఎంబీబీఎస్ సీట్లు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు.

పలువురు కార్పొరేటర్లు రాజీనామా

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు రాజీనామా చేయడంతో పాటు.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. వ్యక్తిగత కారణాల చేత పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయా సోషల్ మీడియా వేదికగా రాజీనామా పత్రాలను వెలువరించారు.